# టెంప్టేషన్...!

ఆడపిల్లలకు తల్లే అన్నీ! అమే పిల్లలకు గైడ్! తల్లి అంటే ఆడపిల్లలకు అవ్యాజనీయమైన ప్రేమ! నడక నడతనేర్పేది తల్లే. అవసరాలు తీర్చేదీ ఆమే! అమ్మే సర్వస్వం!

వెల్లకిలా మంచంమీద పడుకుని నిద్రపోతున్న కూతురు రమ్యను చేత్తోతట్టి లేపి 'ఆడపిల్లలు అలావెల్లకిలా పడుకోరాదు. పీడకలలొస్తయ్... పక్కకు తిరిగి వొత్తిగిలిపడుకో... ఎన్నిసార్లని చెప్పను?-' మరోసారి హెచ్చరించింది తల్లి భారతమ్మ.

పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లే దాకా తల్లి సంరక్షణలో ఆమె పక్కనే పడుకుని నిద్రపోయే అలవాటు రమ్యకు! మరి అత్తవారింటికెళ్లేక ఎవరి పక్కన పడుకోవాలి? అనే ప్రశ్న మనసులో వుత్పన్నం కాగానే ఛీ పాడు అనేసి నవ్వుకుంది. ఈ విషయమూ అమ్మే చెప్తుందా? లేకుంటే మరెవరు చెప్తారు? ఎలా తెలుస్తుంది?... కాలమే నేర్పుతుంది అంటూ తల్లి ఇచ్చిన జవాబుతో తృప్తి చెందింది రమ్య. పుస్తకాలు... సినీమాలు... టీ.వి సీరియల్స్ నేర్పుతయ్. స్నేహితురాళ్లతో ముచ్చట్లు చెప్పుకునేటప్పుడు ఎన్నో విషయాలు తెలుస్తయ్!

రమ్య వుంటున్న వూళ్లో ఇంటర్ దాకానే వుంది. డిగ్రీ చదవాలనుకుంటే మరోవూరు వెళ్లకతప్పదు.

చదివినంత వరకు చాలని తల్లి... కనీసం గాడ్యుయేషనన్నా పూర్తి కానిద్దాం... అంటూ తండ్రి వాదులాడుకున్నారు. ఈ విషయంలో మమ్మీది అపోజిషన్ పార్టీ! తనను చదువుకోసం మరో చోటికి పంపటం మమ్మీకి సుతరాము ఇష్టం లేదు. 'నో' అనటానికి ఆమె కారణాలు ఆమెకున్నయ్!

హాస్టల్లో వుంటుందిలేవే... ఎందరుండి చదువుకోవటం లేదు? అన్నా వప్పుకోలేదు.

ఇంతలో రాఘవయ్య అనబడే శాల్తీ సీన్లోకి ఎంటరైంది.

'రండి బావగారూ... రండి! సమయానికొచ్చారు' ఆహ్వానం పలికేడు రమ్య తండ్రి రమాకాంతరావు.

'ఏదో గొడవపడుతున్నట్టున్నారు...' లోనికి వస్తూనే అన్నాడు రాఘవయ్య.

'ఇదే నా అన్నయ్య గారూ రావటం... వదిన గారిని కూడా వెంటతీసుకు

రావలసింది...' భారతమ్మ పలకరింపు.

'రమ్య చదువు గురించే నేను మీ చెల్లెలు వాదులాడుకుంటున్నాం! అమ్మాయిని హాస్టల్లో వుంచి అయినా సరే డిగ్రీ చదివించాలని నేను... చదువుకోసం పరాయి వూరుపంపటమేమిటని అది.. ఇదే మా వాగ్యుద్ధం! రమ్యకేమో పై చదువుకెళ్లాలని కుతూహలం. మాప్రాబ్లమ్‌కి సొల్యూషన్ చెప్పు...'

'అమ్మాయి చదువకుంటాననంటే మనం కాదనటం బాగోలేదు. ఎక్కడో హాస్టల్లో వుంచటం దేనికి? మా ఇంట్లోనే వుంటుంది. సిటీలో అయితే యూనివర్సిటీ వుంది గనుక పి.హెచ్.డి దాకా చదవచ్చు! లేదూకోరుకున్న కోర్స్ చెయ్యచ్చు... ఏమంటారు?-'

రమ్య సంబరపడింది. రమాకాంతరావు భారతి ఒకరి మొహాలొకరు చూచుకున్నారు.

'అన్నట్టు... అన్నయ్య గారూ... మీ అబ్బాయి ప్రశాంత్‌కు వుద్యోగం వచ్చిందా?-'

'వచ్చిందాని ఇప్పుడా అడగటం-? లక్ష వాడి నెల జీతం. కంపెనీ వాళ్లు కారు కూడా ఇచ్చారు.'

'నీ కొడుకు రమ్యకు వరసే అయినా... నీతో తూగలేం బావా...' రమాకాంతరావు రూటు మార్చి మాట్లాడాడు.

'ఆ విషయం అట్లా వుంచి... మీలో మీరు మల్లగుల్లాలు పడటం ఆపి... రమ్యను నావెంట పంపించండి... హాయిగా చదువుకునిపైకొచ్చి మీకు పేరు ప్రతిష్ఠలు తెస్తుంది. రమ్యకే లోటు రాకుండా నేచూచుకుంటాను. 'కుండబద్దలు కొట్టినట్టు మాట్లడాడు రాఘవయ్య.

రాఘవయ్య చౌదరికి సిటీలో బోలెడు వ్యాపారాలున్నయ్. లక్షల్లో ఆదాయం! సిటీనడి బొడ్డున పెద్ద బంగళా నౌకర్లు చాకర్లు... వంట మనిషి... వడ్డించేవారు... లాన్‌లో మొక్కలకు నీళ్లు పెట్టటానికి తోటమాలి... బంగళాగేటు కాపలాకి వాచ్‌మెన్... కార్లు డ్రైవ్ చేయటానికి ఇద్దరు డ్రైవర్లు ... మంచి సంపన్నుడు. పలుకుబడి కలవాడు. డబ్బుకి వెనకాడడు. నోరు మనసు మంచిది!

ఎట్టకేలకు రమ్యను రాఘవయ్య వెంటపంపటానికి రమాకాంతరావు భార్య భారతి వప్పుకున్నారు.

× × × × ×

రాఘవయ్య అంకుల్ బంగళా బాగా నచ్చింది రమ్యకు!- తానెప్పుడో చిన్న తనంలో వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే రావటం!

బావ మంచి మాటకారి! చనువుగా వుంటాడు. బెరుకు... కొత్త అనేసి ఫీలవడు.

ప్రశాంత్ బాగా నచ్చాడు రమ్యకు! తనను కాలేజీలో ఎడ్మిట్ చేయటం దగ్గర్నుంచి... రోజూ తన కార్లోనే డ్రాప్ ఇచ్చి.... పికప్ చేసుకోవటం దాకా ప్రశాంతే చూచుకుంటున్నాడు.

ప్రశాంత్ వట్టి వాగుడుకాయ! పసితనంలో వాళ్ల మమ్మీ 'వస' ఎక్కువ పోసిందేమో అనుకుంది రమ్య.

'నువ్వట్లా మూగదానిలా వుండటం నాకు అసలు నచ్చదు. బీఫ్రీ రమ్యా! స్నేహితులమే కాదు మన మధ్య బంధుత్వం కూడా వుంది కదా?-'

అంకుల్ ఆంటీలు తను బావతో చనువుగా వుండటం చూస్తే ఏమైనా అనుకుంటారేమోని జంకుతోంది. బావతో క్లోజ్‌గా వుండలేకపోతోంది. గలగలా పారే సెలయేరులా మాట్లాడటం తనకు అలవాటు లేదు. అందుకనే బావలేసే ప్రశ్నలకు ముక్త సరిగ సమాధానలిస్తోంది.

తను హాస్టల్లో జాయినయినట్టయితే ఇంత హేపీగా వుండేది కాదేమో? బావతో పరిచయం ఏర్పడేదే కాదు. బావ ముచ్చట్లు చెప్తూంటే ఎంతో సరదాగ హాయిగా వున్నట్టుంటుంది. బావకు తెలియని విషయం లేదు. ఎన్‌సైక్లో పీడియా!

'రోజూ నన్ను కాలేజీలో డ్రాప్ చెయ్యటం మళ్లీ ఈవినింగ్ పికప్ చేసుకోవటం నీకు బోర్‌గా లేదూ?' పక్క సీట్లో కూర్చున్న రమ్య కార్ డ్రైవ్ చేస్తున్న బావతో అంది.

'నాకెంతో ఆనందంగా వుంది రమ్యా! పైగా... వండరేంటో చెప్పనా?... నాకు గర్ల్‌ఫ్రెండ్స్ అంటూ ఎవరూ లేరు. బిలీవ్ మీ..' తల పక్కకు తిప్పి రమ్య కళ్లలోకి చురుగ్గా చూస్తూ అన్నాడు ప్రశాంత్.

ఇంటి కొస్తూ దోవలో రెస్టారెంటు ముందు కారాపి ఇద్దరూ లోనికి నడిచి ఛైర్స్‌లో సెటిలవగానే 'ఏం తీసుకుందాం చెప్పు... ఆర్డరిద్దాం... స్వీటా... హాటా నెస్ కాఫీ తాగుతావా లేకపోతే ఆపిల్ జ్యూస్ ఆర్డరిద్దామా... కమాన్! మాట్లాడు...' గుక్కతిప్పుకోకుండా మాట్లాడాడు.

'నీ ఇష్టం...'

'నీకంటూ ఏ ఇష్టమూ వుండదా..'

ఎందుకు లేదు బావా... నువ్వంటే నాకు బోలెడంత ఇష్టం అనుకుంది మనసులో

'నాకు ఏదైనా అబ్జెక్షన్ లేదు...'

'హమ్మయ్య థాంక్ గాడ్... సరే కట్‌లెట్ ఆర్డరిస్తాను. తర్వాత జ్యూస్ తాగుదాం! ఏం?-'

తలవూపింది రమ్య!

× × × × ×

బావలాంటి వ్యక్తి తన లైఫ్ పార్ట్నర్ అయితే ఎంత బాగుండు? అని చాలా సార్లు అన్పించింది రమ్యకు. రానురాను ఇద్దరి మధ్య చనువు పెరుగుతోంది. తాను బావకు దగ్గరవుతున్నానని పీలవుతోంది.

బావ కోటీశ్వరుడి బిడ్డ! గొప్ప చదువు... పెద్ద జీతం... సోషల్ స్టేటస్ వున్న వ్యక్తి అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టిన తనను ప్రేమించగలడా? పెళ్లాడటం జరుగుతుందా?- ఇప్పుడు దగ్గరైతే... తర్వాత ఒక్కటి కాలేకపోతే మనసుకు నచ్చచెప్పుకోలేక ఎంతో బాధపడాల్సి వస్తుందనే భయం రమ్యను కలవరపెడుతోంది.

తమ సాన్నిహిత్యాన్ని అంకుల్ ఆంటీ చూచిన ఏ కామెంటూ చెయ్యకపోవటం ఎంతో సంతోషాన్నిస్తోంది.

ఆదివారం ఐమాక్స్ థియేటర్లో ఇంగ్లీషు పిక్చర్‌కు పోదామని ప్రపోస్ చేసినప్పుడు తాను 'నో' అన్లేక తలాడించక తప్పింది కాదు.

థియేటర్లో ఎస్కలేటర్ ఎక్కటం తనకు తొలి అనుభవం. బావ తనను నడుము చుట్టూ చెయ్యి వేసి నేనెక్కడ తూలిపడతానోని పొదివి పట్టుకున్న క్షణాన... బావ చేతి స్పర్శకు తాను ఐస్‌లా కరిగిపోతున్నట్టన్పించింది.

అయినా పబ్లిక్ ప్లేస్‌లో ఏమిటీ చొరవ అనికూడా అన్పించకపోలేదు. బావకు ఇంకా దగ్గరైతే ఎంత బాగుండోని మనసు ఆరాటానికి లోనైంది.

అమ్మో! మరీ ఇంత చనువా?.. ఇంట్లో వారికి తెలిస్తే తన పరువు పోతుంది. చదువు మాన్పించి తనను ఇంటికి పంపించేస్తారేమోనే భయం మరొక వైపు వెంటాడుతోంది.

బావమీద ఆశలు పెంచుకుంటున్న తాను ఎన్నటికీ దూరం కాలేదు.

'ఏదో పరాకుగా వున్నట్టు అవుపిస్తున్నావ్... డోన్ట్ బీ ఎ ఫ్రైడ్... హేపీగా సినీమా చూస్తూ ఎంజాయ్ చెయ్...' అనటంతో కన్ఫ్యూజన్లోంచి బైటికొచ్చింది రమ్య.

× × × × ×

బావ చూపుల్లో... కొంటెతనం... గిలిగింతలు పెడుతోంది. ఇంకా దగ్గరవమంటోంది మనసు. చక్కిలి గింతలు పెట్టే చిలిపి తనానికి రమ్య లొంగిపోవటానికి ఇష్టపడుతోంది.

ఎన్నో వెన్నెల రాత్రుల్లో బావ తాను బంగళా టెర్రేస్ మీద కూర్చుని ఎన్నెన్నో తీపి కబుర్లు చెప్పుకున్నారు.

'ఇంట్లో మా పేరెంట్స్‌ని చూచి భయానికి లోను కావలిసిన పన్లేదు రమ్యా. మమ్మీ డాడీలు మంచి సంస్కారవంతులు. మనం నోరువిప్పి అడిగితే మన పెళ్లికి కాదనరు. సో!... బీ బ్రేవ్!!-' ధైర్యం నూరిపోస్తూ రమ్యను దగ్గరకు లాక్కున్నాడు.

బావ వొడిలో తలవాల్చిన రమ్య వెన్నెల్లో చందమామను చూస్తుండిపోయింది. బావ చిలిపి చేష్ఠలు తనువును మనసును గిలిగింతలు పెడుతున్నయ్.

రేపు మనం స్టార్ హోటల్లో డిన్నర్ చేద్దాం... అని బావ తన ముఖంలో ముఖం పెట్టి అన్న క్షణాన నా మనసనులో తెలియని ఉలికిపాటు... కలవరం! ఈ చనువు ఎంత దూరం వెడుతుందో రమ్య వూహించుకో లేకపోతోంది.

'డిన్నర్‌కెళ్లినప్పుడు కంపెనీ ఎం.డీ ఎదురై 'మిస్టర్ ప్రశాంత్... ఈమె మీ వైఫా?-' అడిగిన క్షణంలో తొట్రుపాటు లేకుండా 'నావుడ్ బి' అంటు డేరింగ్‌గా డిక్లేర్ చేయటం రమ్యను ఆశ్చర్యానికి గురిచేసింది.

బావదంతా హైక్లాస్ సొసైటీ! తన డ్రెస్‌లో మార్పుతెచ్చాడు. బావకు ఇష్ఠమైనవి నచ్చినవి కొనిచ్చాడు.

ఇలాంటి వ్యక్తి కోటికొక్కడైనా వుంటాడాన్పించింది రమ్యకి!

× × × × ×

'బావా! ఫైనల్ ఎగ్జామ్స్‌కు సీరియస్‌గా ప్రిపేరయ్యే నన్ను డిస్టర్బ్ చేయ్యకు ప్లీజ్. నాకు ర్యాంకు రాకపోతే నన్నిక్కడుండనీయరు. మంగళం పాడేస్తారు. ర్యాంకొస్తే పి.జి చేయాలనే వంకతో నేనిక్కడ వుండగలుగుతున్నాను. నీకు దగ్గరగ వుండే

అవకాశం ఉంటుంది- సో... నన్నొదిలెయ్... నువ్వెళ్లి నీ బెడ్ రూమ్‌లో పడుకుని హాయిగా నిద్రపో...' గోముగా అంది రమ్య.

ప్రశాంత్ 'హర్ట్' అయిన వాడిలా ముఖం పెట్టాడు.

'అలిగేవా బావా?- ఈ వేళపుడు నువ్వు నా గదిలో వుండటం అంకుల్ గాని ఆంటీ గానీ చూశారంటే నాకు ప్రమాదం!- మనం ఎప్పటికీ దగ్గరవలేం...'

'నో! నేవెళ్లను. నిన్నొదిలి వెళ్లటానికి నా అంతరాత్మ అంగీకరించటం లేదు డియర్...' మీది మీదికొచ్చాడు.

'నో... నో... బావా! పెళ్లి అయ్యాకే ఏదైనా... అంతవరకు ఓపిక పట్టు... తప్పు బావా... నన్ను మన్నించు...' గింజుకుంటోంది రమ్య.

పులినోటికి లేడిపిల్ల చిక్కినట్టుగా వుంది పరిస్థితి.

'నాలో ఓపిక నశించింది డార్లింగ్... నన్ను క్షమించు'

ఇద్దరూ ఏకమై తెలుగు సినిమాలో హీరో హీరోయిన్లు దొర్లినట్టు మంచం మీది నుంచి దొర్లి నేలమీద పడ్డారు. ప్రశాంత్ బాహు బంధాల్లో మల్లె చెండులా నలిగిపోతుంది రమ్య.

'హెల్ప్... హెల్ప్... అనేసి నేలమీద పడ్డ రమ్య కలతనిద్రలో అరిచింది.

రమ్య పక్క బెడ్‌రూమ్‌లో వున్న రాఘవయ్య అతని భార్య ఒక్క పరుగున రమ్యగదిలో కొచ్చారు.

'ఏమైంది రమ్యా! ఏదైనా పీడకల వచ్చిందా? కాసిని మంచినీళ్లు తాగి పక్కకు వత్తిగిలిపడుకో...' చెప్పింది ఆంటీ.

ఆక్షణంలో మమ్మీ చెప్పిన మాటలు గుర్తుకొచ్చినయ్. ఇదంతా కలా? నిజమైవుంటే కొంప కొల్లేరయ్యేది అనుకుంది.

ఆవచ్చిన రాఘవయ్య దంపతులు తిరిగి తమ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పోయారు నవ్వుకుంటూ.

రమ్యకు మళ్లీ నిద్ర పట్టనేలేదు... పెళ్లి అయ్యే వరకు తాను 'టెంప్ట్' కాకూడదని తీర్మానించుకుంది రమ్య.

(సమాప్తం)